క్లుప్తంగా

సంకల్ప యాత్రలో భాగస్వాములు కండి

కలకడ : మండలంలోని పంచాయతీల వారి నిర్వహించనున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన కార్యక్రమ వివరాలను వెల్లడించారు. 17వ తేదీన కె.బాటవారిపల్లె, 18న బాలయ్యగారిపల్లె, కలకడ, 19న కోన, గుడిబండ, 20న నడిమిచెర్ల, కదిరాయచెర్వు, 21న దిగువతాండ, ఎనుగొండపాళ్యెం, 22న ముడియంవారిపల్లె, నవాబుపేట, 23న రాతిగుంటపల్లె, ఎర్రకోటపల్లె, 24న దేవులపల్లె, కలకడదొడ్డిపల్లె, 25న గంగాపురం పంచాయతీలలో సంకల్పయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అంతర్ రాష్ట్ర హాకీ పోటీల్లో ప్రతిభ



తృతీయ స్థానం నిలిచిన జిల్లా హాకీ క్రీడాకారులు

మదనపల్లె సిటీ : అంతర్ రాష్ట్ర బాలుర జూనియర్ హాకీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు మూడో స్థానం నిలిచారు. ఈనెల 9 నుంచి 12 వరకు తిరుపతిలో అంతర్ రాష్ట్ర జూనియర్ హాకీ పోటీలు జరిగాయి. రాష్ట్రంలోని 18 జిల్లాల నుంచి క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో అన్నమయ్య జిల్లా మూడవ స్థానం నిలిచింది. హాకీ టీం కెప్టెన్ అఖిల్‌వెంకట్‌తో పాటు క్రీడాకారులను పీడీ నరేష్, హాకీ కోచ్ నౌషాద్, ది హాకీ అసోసియేషన్ కోశాధికారి ప్రసాద్‌రెడ్డి శనివారం అభినందించారు.

31న లక్కీడిప్ డ్రా

మదనపల్లె సిటీ : మదనపల్లె- బి.కొత్తకోట బస్సుల్లో ప్రయాణించిన ప్రయాణికుల కోసం ఈనెల 31న లక్కీడిప్ డ్రా తీయనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు టిక్కెట్టు వెనుక తమ పేరు, ఫోన్ నంబర్ రాసి గిఫ్ట్ బాక్సులో వేయాలని కోరారు.

బీజేపీతో కలిసే పార్టీలను ఓడించాలి

– సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు

బి.కొత్తకోట : వచ్చే ఎన్నికల్లో బీజేపీతో జతకట్టి పోటీచేసే పార్టీలను ఓడించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్.నరసింహులు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రాథమిక హక్కులను హరిస్తోందని ఆరోపించారు. ఆదివాసీల భూములను ఆక్రమించే కుట్రలో భాగంగానే కేంద్రం భూ సేకరణ విధానం తీసుకొచ్చిందన్నారు. తిరిగి అధికారం దక్కించుకోవాలని ప్రయత్నిస్తున్న బీజేపీని ఓడించాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, బషీర్ అహ్మద్, సలీంబాషా, చిన్నరెడ్డెప్ప, అంజనప్ప, రఘునాథ్, జవహర్‌బాబు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న సీఐ తమ్మిశెట్టి మధు

పెద్దతిప్పసముద్రం : సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ములకలచెరువు సీఐ తమ్మిశెట్టి మధు హెచ్చరించారు. శనివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో సమీక్షించారు. సీఐ మాట్లాడుతూ కోడి పందేలతో పాటు జూదం, అశ్లీల నృత్యాలపై నిషేధం ఉందన్నారు. చట్టాలను అతిక్రమించి అసాంఘిక కార్యాకలాపాలు నిర్వహిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అంతేగాక కోడి కత్తులు తయారు చేసే వారిపై నిఘా పెట్టడంతో పాటు ములకలచెరువు సర్కిల్ పరిధిలోని సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసులతో నిఘా ముమ్మరం చేసామని సీఐ వెల్లడించారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

కలకడ : కారు ఢీకొని వ్యక్తికి గాయాలైన సంఘటన శనివారం మండలంలోని కె.దొడ్డిపల్లె పంచాయతీ గోపాలపురం వద్ద చోటు చేసుకుంది. మండలంలోని నడిమిచెర్ల పంచాయతీ కొత్తపల్లె గ్రామానికి చెందిన వెంకట్రమణ కుమారుడు సాంబశివ ద్విచక్రవాహనంలో కలకడ నుంచి నడిమిచెర్ల కొత్తపల్లెకు వెళ్తున్నాడు. మార్గమధ్యంలో గోపాలపురం వద్ద వెనుక వైపు నుంచి కారు ఢీకొంది. ప్రమాదంలో సాంబశివ తలకు, చేతికి, కాలికి గాయాలు అయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం 108లో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

పీలేరు రూరల్ : పీలేరు పట్టణంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సురేంద్రనాథరెడ్డి, పి. సుబ్రమణ్యం తెలిపారు. మకర సంక్రాంతి సందర్భంగా సోమవారం మహిళలు తమ ఇళ్ల ముందు వేసిన ముగ్గులను పరిశీలించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనేవారు ఆదివారం సాయంత్రం లోపు తమ పేర్లు, డోర్ నెంబర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9441392689, 9502222334 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఆహా ఏమి రుచి..తినరా మైమరచి

- అనపకాయలకు భలే డిమాండ్
- పొరుగు రాష్ట్రాలకు ఎగుమతులు
- రూ.కిలో రూ.70 నుంచి 80



అమ్మకానికి సిద్ధంగా ఉన్న అనపకాయలు

మదనపల్లె సిటీ/గుర్రంకొండ : అనపకాయల సీజన్ వచ్చేసింది. సంక్రాంతి పండుగకు అనపకాయలకు భలే డిమాండ్. మార్కెట్‌ను అనపకాయలతో ముంచెత్తుతుంది. జిల్లాలోని పడమటి మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగతో పాటు అనపకాయలు పండిస్తారు. నవంబర్ నుంచి ఫిబ్రవరి చివరి వరకు సీజన్ ఉంటుంది. కిలో రూ.70 నుంచి 80 వరకు పలుకుతున్నాయి. రామసముద్రం, మదనపల్లె, నిమ్మనపల్లె, కురబలకోట, వాల్మీకిపురం, పీలేరు, గుర్రంకొండ ప్రాంతాల్లో అనపకాయలు పండిస్తున్న రైతులు మార్కెట్‌కు తెస్తున్నారు. అనపకాయలతో చేసే పితికి పప్పు కూర దోసెలు, రాగిసంగటిలో వేసుకుని తింటే ఆ రుచే వేరుగా ఉంటుంది. భోజనప్రియులు పితికిపప్పు కూరను ఎంతో ఇష్టంగా తింటారు.

సంక్రాంతి స్పెషల్..

సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు అనకాయల కూర,దోసెలతో వంటలు వండుతారు. ఇదే పడమటి ప్రాంతాల్లో పండుగ స్పెషల్. ఏ పల్లెలో చూసిన పితికిపప్పు,దోసెలే కన్పిస్తాయి. ఇళ్లల్లో వారానికి మూడు సార్లయినా పితికిపప్పు రుచి చూడాల్సిందే. కేవలం వర్షాధారంగా చేళ్లల్లో పండిన నాటు అనపకాయలు మాత్రమే చాలా రుచిగా ఉంటాయి. వీటిని ముట్టుకోగానే బంకగా ఉండి, వాటి వాసన గంటసేపు ఉంటుంది.

అబ్బా దాని రుచే వేరు..

అనపగింజలను గింజల కూర, చారు, సాంబారు చేస్తారు. అనపకాయలు ఒలిచి గింజలను గిన్నెలో నీటిలో రాత్రి నానబెట్టి మరుసటి రోజు గింజలను పితికి పప్పు కూరలు, చారుగా చేస్తారు. ఉదయమే దోసెల్లో పితికిపప్పు ఇష్టంగా తింటారు. కొందరు పితికిపప్పును ఎండబెట్టి నూనెలో వేపుడు చేసి తింటారు.

పొరుగు రాష్ట్రాలకు...

మదనపల్లె పట్టణం చిత్తూరు బస్టాండులో అనపకాయలకు మార్కెట్ ఉంది. రామసముద్రం, నిమ్మనపల్లె, మదనపల్లె, కురబలకోట,వాల్మీకిపురం ప్రాంతాల నుంచి మార్కెట్‌కు రైతులు ప్రతి రోజు సాయంత్రం అనపకాయలు సంచుల్లో తెస్తారు. ఇక్కడి నుంచి వ్యాపారులు కొనుగోలు చేసి చెన్నై, వేలూరు, బెంగళూరు, చిత్తూరు, తిరుపతి ప్రాంతాలకు నిత్యం ఎగుమతి అవుతున్నాయి. మార్కెట్‌కు ప్రతి రోజు 5 వేల కేజీల అనపకాయలు వస్తున్నాయి. పొరుగు రాష్ట్రాల్లో అనపకాయలకు మంచి డిమాండ్ ఉంది. రుచిగా ఉండటంతో వీటిని బాగా ఇష్టపడతారు.

ధరలు బాగున్నాయి

అపనకాయల ధరలు బాగున్నాయి. పురుగు పట్టడం వల్ల దిగుబడి తగ్గింది. రెండు అనపపంట సాగు చేశాను. నాటి అనపకాయలు కావడంతో మంచి డిమాండ్ ఉంది. ప్రతి రోజుల మార్కెట్ నుంచి చెన్నైకి వెళుతున్నాయి.

– వెంకటరమణ, రైతు, రామసముద్రం

ఊరటనిచ్చిన అనపకాయలు

అనపకాయలు ఊరటనిచ్చాయి.వేరుశనగ పంట పూర్తిగా దెబ్బతినింది. దీంతో అనపకాయలకు ధరలు బాగున్నాయి. పడమటి ప్రాంతాల అనపకాయలు నాణ్యతతో పాటు రుచిగా ఉండటంతో బెంగుళూరు,చైన్నై మార్కెట్‌లకు వెళుతుంది.

– రమేష్, రైతు, గొల్లపల్లి, మదనపల్లె మండలం

పోషకాలు మెండు

ఈ సీజన్‌లో మాత్రమే లభించే అనపకాయలు, పితికిపప్పు మంచి పోషకాలు ఉంటాయి. ఎలాంటి క్రిమిసంహారక మందులు లేకుండా వర్షాధారంగా చేలల్లో పంట పండుతుంది. కాబట్టి ఆరోగ్యానికి ఇవి చాలా మంచిది.

– డాక్టర్ సరస్వతమ్మ, జిల్లా ఆస్పత్రి, మదనపల్లె

ప్రతిఇంటా సంక్రాంతి వెలుగులు



ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

బి.కొత్తకోట : సంక్రాంతి పండుగను నియోజకవర్గంలోని ప్రజలు ప్రతిఇంటా సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆకాంక్షించారు. శనివారం ఆయన మాట్లాడుతూ పల్లెలకు, రైతాంగానికి ముఖ్యమైన సంక్రాంతి పండుగ అందరి కుంటుబాల్లో వెలుగులు నింపాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతాంగానికి పథకాలు, కార్యక్రమాల ద్వారా అండగా నిలిచిందన్నారు.

సంక్రాంతి శుభాకాంక్షలు

వాల్మీకిపురం : పీలేరు నియోజకవర్గంలోని ప్రజలు సుఖశాంతులతో ఉండాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆకాంక్షించారు. భోగి, సంక్రాంతిని పురస్కరించుకొని నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పే అచ్చమైన తెలుగుపండుగ సంక్రాంతిగా అభివర్ణించారు. భోగి భోగభాగ్యాలను, మకర సంక్రాంతి ప్రజలందరి జీవితాల్లో అభివృద్ధితో కూడిన మార్పు, ప్రతి ఇంటిలోనూ సిరులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

చుక్కలన్ని ముగ్గులై..



ముగ్గుల పోటీలో గెలుపొందిన మహిళకు ప్రథమ బహుమతి అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట రూరల్ : హరివిల్లులోని వర్ణాలన్నీ ముగ్గులై నేలవాలాయి. పలు చోట్ల జరిగిన ముగ్గుల పోటీలు కన్నులపండువగా సాగాయి. సంక్రాంతి శోభను ఒక రోజు ముందే తీసుకొచ్చాయి. దివంగత ఆకేపాటి లక్ష్మిరెడ్డి, అనసూయమ్మ జ్ఞాపకార్థం జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆకేపాటి ఎస్టేట్‌లో శనివారం నిర్వహించిన ఈ ముగ్గుల పోటీలలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అందమైన రంగులతో సుందరమైన ముగ్గు లు వేశారు. న్యాయ నిర్ణేతలుగా మిరియాల సురేఖ, అన్నపూర్ణ, హేమలత వ్యవహరించారు. ఈ పోటీలలో రేణింతల గ్రామానికి చెందిన సుమలత ప్రథమ బహుమతిగా రూ.4016, పెద్ద దళితవాడకు చెందిన లావణ్య ద్వితీయ బహుమతిగా రూ.3016, మందపల్లి గ్రామానికి చెందిన అమరావతి తృతీయ బహుమతిగా రూ.2016, అచ్చనపల్లికి చెందిన పుష్పలత, మందపల్లి గ్రామానికి చెందిన భార్గవిలకు కన్సోలెషన్ బహుమతులుగా రూ.1000 వంతున జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అందజేశారు. అదే విధంగా పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ క్యారీ బాక్స్‌లను బహుమతులుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి, నాయకులు జబ్బిరెడ్డి వెంకటరెడ్డి, నల్లబోతుల ఈశ్వరయ్య, బుర్రు నాగేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం

చిట్వేలి: రక్తదానం ఎంతో పుణ్య కార్యక్రమ మని.. రక్తదాతలు మహోన్నతులని రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు కొనియాడారు. శనివారం రాజుకుంట ఆరోగ్య ఉప కేంద్రంలో ఐటీ ఉద్యోగులు నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే పాల్గొని దాతలకు ప్రోత్సాహమిచ్చారు. రెడ్‌క్రాస్ సంస్థ సేకరించిన రక్తదాన శిబిరంలో 50 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. రాజుకుంట యువనాయకులు మాధినేని తదితరులు పాల్గొన్నారు.

మూగ జీవులను ప్రేమించాలి



మూగజీవుల సంరక్షకులకు ఆర్థిక సాయం అందిస్తున్న చంగా ఈశ్వరయ్య

రాయచోటి టౌన్ : మూగ జీవులను ప్రేమించాలని ట్రావెల్ ఏజెంట్ మాజీ కౌన్సిలర్ చంగా ఈశ్వరయ్య అన్నారు. రాయచోటి పట్టణంలోని లక్ష్మీపురంలో నివాసం ఉండే ఓం ప్రకాష్, మౌనిక మూగ జీవులకు (కుక్కలు, కోతులకు) ఆహారం అందిస్తుంటారు. వారు చేస్తున్న సేవలను గుర్తించిన ఈశ్వరయ్య శనివారం తన వంతుగా మూడు బస్తాల బియ్యానికి అయ్యేంత ఖర్చు రూ.9000లను అందజేశారు.

వండాడిలో వీక్షిత్ భారత్ సంకల్పయాత్ర

చిన్నమండెం : మండల పరిధిలోని వండాడి గ్రామంలో శనివారం వీక్షిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంపీడీఓ దివ్య తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముసల్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న 17 రకాల పథకాలను ప్రజ లు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం ప్రజలకు మంజూరైన సంక్షేమ పథకాలను అందజేశారు. డాక్టర్ రియాజ్, వ్యవసాయాధికారి గీత, ఈఓపీఆర్‌డీ పవన్‌కుమార్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నివాళి

నందలూరు(రాజంపేట) : నందలూరు మండలం, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీకి చెందిన రిటైర్డ్ టీచర్ లక్ష్మీ నరసమ్మ కుమారుడు పసుపులేటి చంద్రశేఖర్ బాబు (47) శనివారం ఆకస్మికంగా మృతి చెందాడు. ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి చంద్రశేఖర్ బాబు భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులతన తన ప్రగాడ సానుభూతిని తెలియజేశారు.

దుస్తుల పంపిణీ

రాజంపేట రూరల్ : ఎస్ఆర్‌బి కేకేరెడ్డి సహకారంతో శనివారం పెద్దకారంపల్లిలో మన్నూరు రామలక్షుమ్మ, నారాయణరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం 1000 కుటుంబాల వారికి దుస్తుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వీరబల్లి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి, కడప జిల్లా లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ మానస చిన్నప్పరెడ్డి కేకేరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇతర దేశాలలో జీవనం సాగిస్తున్న కేకే రెడ్డి సొంతూరి ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ప్రతి సంవత్సరం సంక్రాంతికి తన సొంత నిధులతో దుస్తులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కేకేరెడ్డి మాతృమూర్తి రామలక్షుమ్మ, ఉమ్మడి జిల్లా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పోతుల వెంకటరామిరెడ్డి, రాజంపేట మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా, ఎంపీటీసీ ఏ వరదరాజు, సంజీవరెడ్డి,పవన్, కేకేరెడ్డి సోదరులు ఎంవీ సుబ్బారెడ్డి, సుభోద్ రెడ్డి, నారాయణరెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



నిసార్‌అహ్మద్‌కు ఆశీస్సులు అందిస్తున్న వేదపండితులు

మదనపల్లె : పట్టణంలోని దేవళంవీధి శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ మదనపల్లె సమన్వయకర్త నిసార్‌అహ్మద్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మదనపల్లె సమన్వయకర్తగా పార్టీ అధిష్టానం ప్రకటించిన తర్వాత ఆయన తొలిసారిగా స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గోవర్ధన్, వేదపండితులు బాలాజీ తదితరులు.. సమన్వయకర్త నిసార్‌అహ్మద్‌కు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించి, తీర్థప్రసాదాలు అందించారు. ఆస్థాన మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా నిసార్ అహ్మద్ మాట్లాడుతూ స్వామివారి కృపాకరుణా కటాక్షాలు ప్రజలందరిపై మెండుగా ఉండాలని, నియోజకవర్గ ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలందరూ సంతృప్తిగా ఉన్నారని, రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సమపాళ్ళలో జరిగిందన్నారు. నియోజకవర్గంలో ఇంటింటికీ తిరిగి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన మేలును వివరించి, 2024లో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ బింగిపాండు, ఆర్యవైశ్యసంఘం మాజీ అధ్యక్షులు మాకంఅశోక్‌కుమార్, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం అధికారప్రతినిధి గార్లచంద్రమౌళి, నాయకులు పి.వసంత్‌రెడ్డి, ఏపీ కురుబసంఘం రాష్ట్ర అధ్యక్షులు జబ్బలశ్రీనివాసులు, కౌన్సిలర్ కరీముల్లా, పసుపురవి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ త్యాగం స్ఫూర్తిదాయకం



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బోనాసిజాన్‌బాబు తదితరులు

మదనపల్లె : సమానత్వం, సామాజిక న్యాయం, హక్కుల కోసం పోరాడటంలో డాక్టర్.బి.ఆర్.అంబేడ్కర్ చేసిన పోరాటాలు, త్యాగాలు ఎంతో స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ క్రైస్తవ విభాగం జిల్లా అధ్యక్షుడు బోనాసి జాన్‌బాబు తెలిపారు. అంబేడ్కర్ చూపిన మార్గంలో అందరూ పయనించాలని కోరారు. సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ, క్రైస్తవసంఘ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జాన్‌బాబు మాట్లాడుతూ విజయవాడలో ఈనెల 19న భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహం ఆవిష్కరణ, స్మృతివనం ప్రారంభిస్తున్న సందర్భంగా సామాజిక సమతా సంకల్పం కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా బడుగు, బలహీనవర్గాలకు చెందిన వ్యక్తులను రాష్ట్రప్రభుత్వం ఆహ్వానిస్తోందన్నారు. దీనికి ముఖ్యమంత్రికి క్రైస్తవ సంఘం తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, రిచర్డ్ అలెగ్జాండర్, జీవరత్నం, అభిషేక్, దినకరన్, దేవదానం తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు

పీలేరు రూరల్ : మండలంలోని బాలంవారిపల్లె పంచాయతీ మొరవపల్లెలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో మున్నా టీమ్ విజేతగా నిలిచింది. మొత్తం ఐదు రోజుల పాటు జరిగిన ఈ టోర్నమెంట్‌లో 20 టీములు పోటీ పడ్డాయి. శనివారం బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. విజేతగా నిలిచిన మున్నా టీముకు రూ. 15,116, రన్నర్‌గా నిలిచిన కొత్తపేట టీముకు రూ. 7,116 అందజేశారు. నిర్వాహకులు, యూటీఎఫ్ నాయకులు సుధాకర్ మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించి దేశ భవిష్యత్తుకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవఅధ్యక్షులు శివారెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు అక్రంబాషా, కోశాధికారి చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి సదాశివారెడ్డి, నాయకులు రాధాకృష్ణ వెంకటరమణ, చెంగల్‌రాయులు, శెట్టి సుబ్రమణ్యం, కృష్ణమూర్తి, పోతయ్య, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సామిచెరువులో హెచ్చరిక బోర్డులు



సామిచెరువులో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

మదనపల్లె : మండంలంలోని బసినికొండ రెవెన్యూ గ్రామం సామిచెరువులో ప్రభుత్వ స్థల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. సర్వేనెం.452లోని విస్తీర్ణం 2.42 ఎకరాలు ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ, ఆక్రమణదారులు ప్రవేశిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలంలో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్, మదనపల్లె పేరుతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే సామిచెరువు ఇరిగేషన్ పరిధిలోకి వస్తుందని, చెరువు ఇప్పటికే సగానికి పైగా ఆక్రమణ జరిగిందని, మిగిలిన చెరువునైనా అధికారులు కాపాడాలని ఇసుకనూతిపల్లె, కొండామాద్రిపల్లె గ్రామస్తులు విన్నవించారు. పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులు సామిచెరువు ఆక్రమణలకు పాల్పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ కృష్ణారావు

ములకలచెరువు : ములకలచెరువు సర్కిల్ కార్యాలయాన్ని శనివారం జిల్లా ఎస్పీ కృష్ణారావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ములకలచెరువు సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలతో సమీక్ష నిర్వహించి నేరాల నియంత్రణకు చేపట్టాల్సిన పలు సూచనలు సలహాలు ఇచ్చారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందెం, పేకాట నిర్వహిస్తే దాడులు నిర్వహించి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు అతిగా మద్యం సేవించి ప్రమాదాల బారిన పడొద్దని సూచించారు. సమావేశంలో సీఐ తమ్మిశెట్టి మధు, ఎస్‌ఐలు గాయత్రి, రవీంద్రబాబు, లోకేష్ రెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వేగంగా సీసీ రోడ్ల నిర్మాణ పనులు



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

పెద్దమండ్యం : ఉపాధి హామీ నిధులతో పెద్దమండ్యం గ్రామంలో సిమెంటు రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గ్రామ పరిధిలోని మిట్టమాలపల్లె, పెద్దమండ్యం, ఉప్పరపల్లె గ్రామాలలో సిమెంటు రోడ్ల నిర్మాణం పనులు గ్రామ సర్పంచ్ సోదనపల్లె బాషా, ఎంపీటీసీ సభ్యులు మంచూరి జయరాం చేపట్టారు. ఉప్పరపల్లెలోని రామాలయం వీధిలో జరుగుతున్న సిమెంటు రోడ్డు నిర్మాణం పనులను సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆధ్వర్యంలో గ్రామ పరిధిలోని ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ జనార్దన్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు



క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న సర్పంచ్ గంగులమ్మ

వాల్మీకిపురం : వాల్మీకిపురం పంచాయతీ పునుగుపల్లిలో సంక్రాంతి క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం సర్పంచ్ గంగులమ్మ, ఉపసర్పంచ్ కేశవ రెడ్డిలు క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు పండుగలను సంతోషంగా జరుపుకోవాలని, క్రీడలతో మానసిక ఉల్లాసం, ఉత్సాహం లభిస్తాయన్నారు. కార్యక్రమంలో నీళ్ళభాస్కర్, శ్రీధర్‌రాయల్, రఘు, శ్రీనివాసులు శెట్టి, రవీంద్ర రెడ్డి, కిరణ్, నవీన్, కేశవ, చిట్టీ, ప్రసాద్, మురళి, అహ్మద్, కరీం, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పీరయ్య స్వామి ఆరాధనోత్సవాలు



పీరయ్యస్వామి సమాధి

చిన్నమండెం : మండల పరిధిలోని చిన్నర్సుపల్లె గ్రామం పీరయ్యమఠంలో సోమవారం నుంచి ఆరాధన మహోత్సవాలు జరగనున్నాయి. 218 ఏళ్ల క్రితం పీరయ్యస్వామి సజీవ సమాధి అయ్యారని చరిత్ర చెబుతోంది. వారి ఆరాధనోత్సవాలు ఈ నెల 15వ తేదీ నుంచి రెండు రోజుల పాటు నాలుగవ పీఠాధిపతి నాగలింగమయ్య ఆధ్వర్యంలో ఘనంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా సోమవారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు, పుష్ప అలంకరణ, అఖండ భజన, రాత్రి వీరబ్రహ్మేంద్రస్వామి జీవితచరిత్ర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం మౌలాలి జెండా ఊరేగింపు నిర్వహిస్తారు. రావి, వేప కలిసి ఉన్న చెట్టులో జెండాను ప్రతిష్టిస్తారు. పీరయ్య స్వామి మొదటిసారి హిందూ, ముస్లిం సోదరులు ఐక్యతకు నిదర్శనంగా ఈ జెండాను ప్రతిష్టించారు. ఉత్సవాలకు భక్తులు తరలి రావాలని మఠాధిపతి వారసులు పిలుపునిచ్చారు.

ప్రభుత్వ పథకాలు

సద్వినియోగం చేసుకోవాలి

పెద్దమండ్యం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీధర్‌రావు అన్నారు. మండలంలోని గుర్రంవాండ్లపల్లె, శిద్దవరం గ్రామాలలో శనివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాలపై అధికారులు వివరించారు. అలాగే ఆర్థిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పథకాలు, వాటి లబ్ధి గురించి అధికారులు తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హరిప్రసాద్, ఈవోపీఆర్‌డి జనార్దన్, ఏపీవో మురళి, వాటర్‌షెడ్ పీవో రవీంద్ర, సర్పంచ్ లు సుధాకరనాయుడు, విజయకుమారి, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

జగన్ ఐటీఆర్మీ పోస్టర్లు ఆవిష్కరణ

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జగన్ ఐటీఆర్మీ పోస్టర్లను ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ఐటీ వింగ్, యువకులు ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికలలో ప్రతి ఒక్కరూ ఆర్మీ జవాన్లు లాగా పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరాయని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరికీ తెలియాలంటే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఐటీ వింగ్ ప్రెసిడెంట్ చంద్ర, సోషల్ మీడియా కన్వీనర్ పోలి ప్రవీణ్ రెడ్డి, మహేష్, దిలీప్, సుమన్‌లతో పాటు సుధాకర్ రాజు, చైతన్య, సిద్దూరాయల్, సురేష్, రమణ పాల్గొన్నారు.